సాక్షి ప్రకాశం

శనివారం । 19 । ఆగస్టు । 2023



పక్కాగా ఎన్నికల బందోబస్తు

పంచాయతీ ఉప ఎన్నికల్లో భాగంగా శనివారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో బందోబస్తు పక్కాగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. - IIలో..



పాకల..కళకళ

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పాకల పంచాయతీలో రూ.7.33 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తిచేశారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
35/27

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ

- ప్రభుత్వ ఉద్యోగుల ప్రత్యేక స్పందనకు 39 అర్జీలు



ఉద్యోగుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

ఒంగోలు అర్బన్: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం స్పందన భవనంలో ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రత్యేక స్పందన కార్యక్రమం నిర్వహించారు. దీనిలో మొత్తం 39 అర్జీలు ఉద్యోగులు కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ప్రతి నెలా మూడో శుక్రవారం ఎంప్లాయిస్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగుల సర్వీసు అంశాల్లో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. పనిచేస్తున్న ప్రదేశంలో వారికి అవసరమైన మౌళిక వసతులు కల్పిస్తామన్నారు. ఉద్యోగులు అందచేసిన అర్జీలు పరిశీలించి త్వరగా పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఉద్యోగులు ఉత్తమ సేవలు అందించేలా నిబంధనల మేరకు వారికి కావాల్సిన ప్రతి అవసరాన్ని తీరుస్తామన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

రెండో రోజు ‘మార్గదర్శి’లో సోదాలు

ఒంగోలు టౌన్: ఆర్థిక మోసాలకు సంబంధించిన ఆరోపణలపై ఒంగోలులోని మార్గదర్శి బ్రాంచిలో సీఐడీ చేస్తున్న తనిఖీలు రెండో రోజు కూడా కొనసాగాయి. గురువారం మధ్యాహ్నం ఒంగోలుకు చేరుకున్న నెల్లూరు సీఐడీ డీఎస్పీ విజయకుమార్ నేతృత్వంలోని బృందంతో పాటుగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖకు చెందిన అధికారులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. రెండు బృందాలుగా విడిపోయి ప్రతి ఫైలును క్షుణ్ణంగా పరిశీలించారు. గురువారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం 6.30 వరకు కొనసాగిన తనిఖీలు ఆ తరువాత అర్ధరాత్రి నుంచి శుక్రవారం తెల్లవారుజాము వరకు కొనసాగించినట్లు సమాచారం. తిరిగి శుక్రవారం ఉదయం 10 గంటల తరువాత మార్గదర్శి కార్యాలయానికి చేరుకున్న సీఐడీ అధికారులు రెండో రోజు కూడా తనిఖీలు రాత్రి పొద్దుపోయాక కూడా కొనసాగించారు. తొలుత న్యాయవాదుల ద్వారా తనిఖీలను అడ్డుకోవాలని ప్రయత్నించిన మార్గదర్శి సిబ్బంది సీఐడీ అధికారుల హెచ్చరికలతో ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. ఇదిలా ఉండగా ఒంగోలు మార్గదర్శిలో చందాదారులు, డిపాజిటర్లకు సంబంధించిన చెల్లింపులపై సీఐడీ అధికారులు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేక సిబ్బంది ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది. కీలక సాక్ష్యాధారాలను సేకరించిన సీఐడీ అధికారులు చిట్‌ఫండ్ చట్టాన్ని మార్గదర్శి ఉద్దేశపూర్వకంగానే ఉల్లంఘించినట్లు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తుంది. తనిఖీలు జరుగుతున్నంత సేపు ఈనాడు, ఈటీవీ సిబ్బంది మార్గదర్శి కార్యాలయం వద్దే పడిగాపులుకాశారు.

పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- నేడు 15 వార్డులు, 1 సర్పంచ్ స్థానానికి ఎన్నికలు

ఒంగోలు అర్బన్: జిల్లాలో ఆకస్మికంగా ఖాళీలు ఏర్పడిన పంచాయతీల సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు, నిబంధనల మేరకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని, అందుకు సర్వం సిద్ధం చేశామని జిల్లా పంచాయతీ అధికారి, అదనపు ఎన్నికల అధికారి నారాయణరెడ్డి తెలిపారు. జిల్లాలో మొత్తం 2 సర్పంచ్ స్థానాలు, 63 వార్డు సభ్యులకు సంబంధించి ఖాళీలు ఉండగా వాటిలో 47 వార్డు సభ్యులు, 1 సర్పంచ్ స్థానం ఏకగ్రీవం అయినట్లు తెలిపారు. మరొక వార్డుకు ఎటువంటి నామినేషన్ నమోదు కాలేదన్నారు. దీంతో మిగిలిన 15 వార్డులకు, 1 సర్పంచ్ స్థానానికి శనివారం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆయా పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ సామగ్రిని, ఎన్నికల సిబ్బంది శుక్రవారం రాత్రికే చేర్చామని, ఎన్నికల కేంద్రాల వద్ద బందోబస్తు కూడా పక్కాగా ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా, నిబంధనల ఉల్లంఘన జరగకుండా అన్నీ ఏర్పాట్లు చేశామన్నారు.

20న జిల్లా యోగా జట్ల ఎంపిక

ఒంగోలు సిటీ: ఉమ్మడి ప్రకాశం జిల్లా యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాస్థాయి యోగా సెలక్షన్స్ ఈ నెల 20వ తేదీ గద్దలగుంటలోని ఎస్.పి.కే ఓరియంటల్ స్కూల్‌లో జరుగుతాయని జిల్లా సెక్రటరీ డీఎల్ కిరణ్మయి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరీలలో ఆడవారికి, మగవారికి విడివిడిగా పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ పేర్లను 90309 65970 ఫోన్‌నంబరును ద్వారా నమోదు చేసుకోవాలన్నారు.



పచ్చని బంగారంపై మాయగాళ్ల పంజా..!

పచ్చని బంగారంగా పేరొందిన వెదురును అక్రమార్కులు ఇష్టారాజ్యంగా దోచేస్తున్నారు. వెదురు చెట్లు ఆర్థికంగానే కాకుండా పర్యావరణపరంగా కూడా ఉపయోగపడతాయి. నల్లమల అటవీ ప్రాంతంలో నిబంధనలకు తూట్లు పొడుస్తూ యథేచ్ఛగా వెదురు నరికివేస్తూ అక్రమ రవాణా చేస్తున్నారు. దీనిని కట్టడి చేయాల్సిన అటవీశాఖ అధికారుల్లో కొంతమంది చేతివాటం చూపిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నిర్దిష్ట సమయం ముగిసినా నరికివేతలు ఇష్టారాజ్యంగా సాగుతున్నాయి.

- నల్లమలలో యథేచ్ఛగా నరికివేతలు
- వెదురుబొంగు కూపుల్లో అధికారుల మాయాజాలం
- సమయం దాటినా కొనసాగుతున్న నరికివేత
- అడుగడుగునా నిబంధనలకు పాతర

గిద్దలూరు రూరల్: గిద్దలూరు అటవీశాఖలో అవినీతి వృక్షాల వేర్లు పాతుకుపోయాయి. అభయారణ్యంలో అడిగే వారు లేరు కదా అని వారి ఇష్టానుసారం వ్యవహరిస్తూ నిబంధనలకు పాతర వేస్తున్నారు. గిద్దలూరు డీఈటీ డివిజన్ పరిధిలో వెదురు బొంగుల నరికివేతలకు సంబంధించిన అనుమతులు ముగిసినా కొనసాగుతుండటం గమనార్హం. గిద్దలూరు అటవీశాఖ పరిధిలోని కొత్తకోట, సంజీవరాయుడుపేట, టన్నల్, ఉయ్యాలవాడ నాలుగు బీట్ల పరిధిలో గువ్వలపెంట, వట్టిమడుగు, టన్నల్ మొత్తం మూడు కూపులకు 900 నుంచి 1000 హెక్టార్లలో వెదురు బొంగుల కటింగ్‌కు అనుమతులిస్తారు. తొలి విడతగా అక్టోబర్ నుంచి మార్చి వరకూ, రెండో విడత మే నుంచి జూన్ వరకూ నరికివేతలకు అనుమతులిస్తారు. అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంచారం లేని ప్రాంతాలను గుర్తించి టీసీ 1, టీసీ 2, టీసీ 3గా విభజిస్తారు. ఆయా ప్రాంతాలు వెదురు నరికివేతకు అనుకూలంగా ఉన్నట్లు అధికారులు ఆదేశాలు జారీ చేస్తారు. రెండో విడతగా మే నుంచి జూన్ 30వ తేదీ వరకూ వెదురు బొంగుల కటింగ్‌కు అధికారులు అనుమతిచ్చారు. వీటి రవాణా కోసం మరో ఏడు రోజులు.. అంటే జూలై 7వ తేదీ వరకూ అనుమతులిచ్చారు. ఆలోపు నరికిన వెదురును అటవీశాఖ డిపోలకు చేర్చాల్సి ఉంటుంది. ఆ తర్వాత వెదురు కటింగ్ పనులు పూర్తిగా నిలిపేయాలి. ఆగస్టు రెండో వారం దాటుతున్నా అభయారణ్యంలో నరికివేతలు కొనసాగుతూనే ఉన్నాయి. కొంత మంది అటవీశాఖ అధికారుల అండదండలతో వెదురు బొంగులను యథేచ్ఛగా అడవి దాటించేస్తున్నారు. అంతేకాదు.. అధికారులు అనుమతించిన ప్రాంతంలోనే కాకుండా ఇతర ప్రాంతాల్లో సైతం వెదురు నరికేస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. దీంతోపాటు రాత్రుల సమయంలో పర్మిట్లు లేని లారీలు అటవీ ప్రాంతంలో ఇష్టానుసారంగా తిరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆగస్టు 16వ తేదీ అభయారణ్య ప్రాంతం నుంచి అక్రమంగా తరలిస్తున్న వెదురు బొంగుల లారీని దిగువమెట్ట అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకోవడమే ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. వెదురు కాంట్రాక్టర్లతో చీకటి లావాదేవీలు నిర్వహిస్తున్న కొందరు అటవీశాఖ అధికారుల ప్రమేయం వల్లే అక్రమ రవాణా జోరుగా సాగుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. దొంగతనంగా వచ్చే వెదురు బొంగులకు పాత లెక్కల ప్రకారం దొంగ పర్మిట్లు రాస్తూ అక్రమంగా తరలిస్తున్నారని తెలుస్తోంది.



అటవీశాఖ కార్యాలయం



అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన వెదురుబొంగుల లారీ (ఫైల్)

నిబంధనలకు పాతర...

ఫస్ట్‌క్లాస్ అయితే 2,500, రెండో రకం అయితే 4,500, మూడో రకం (చిట్టిలు) అయితే 9,000 బొంగులు తరలించాల్సి ఉంది. నిబంధనలకు పాతర వేస్తున్న కొందరు కాంట్రాక్టర్లు లారీలకు అదనంగా బొంగులు వేసుకుని అడవి దాటిస్తున్నారు. అధికారిక లెక్కల్లో మాత్రం భారీ తేడా ఉంటోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాల్సి ఉంది. వెదురు డిపోల్లో మొదటి రకం వెదురు బొంగు ఒక్కోటి రూ.50 నుంచి రూ.60, రెండో రకం రూ.35 నుంచి రూ.50, మూడో రకం రూ.25 నుంచి రూ.40 వరకు విక్రయించేలా వేలంపాటలో ప్రభుత్వం ధరలు నిర్ణయిస్తుంది. వీటికి ఎవరైతే ఎక్కువ పాటపాడతారో వారికి ఆ ధరల ప్రకారం వెదురుబొంగులు అప్పగిస్తారు. కూపులు ప్రారంభమైన రోజు నుంచి ప్రతి నెలా 15వ తేదీ దిగువమెట్ట డిపోలో వెదురుబొంగుల వేలంపాట ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఉంటుంది. ఉన్నతాధికారులు దిగువమెట్ట చెక్‌పోస్టు వద్ద సీసీ కెమెరాలను పర్యవేక్షిస్తే నిజానిజాలు తేటతెల్లమవుతాయి.

అక్రమాలపై నిఘా...

> వెదురుబొంగుల అక్రమ రవాణాపై నిఘా పెంచాం. సీసీ కెమెరాలతో నిరంతరం పరిశీలిస్తున్నాం. అందులో భాగంగానే ఇటీవల అక్రమంగా వెదురు లోడుతో వెళుతున్న లారీని స్వాధీనం చేసుకున్నాం. అక్రమార్కులపై కేసులు నమోదు చేస్తాం.
>
> – వై.నరసింహారావు, డిప్యూటీ డైరెక్టర్

బెదురుతున్న వన్యప్రాణులు

పులులు, ఇతర జంతువుల సంగమానికి ఇబ్బంది కలగకుండా అడవిలో ఎటువంటి అలజడి లేకుండా వదిలేయాల్సి ఉంది. కానీ, కొందరు అటవీశాఖ ఉద్యోగుల స్వార్థానికి పులుల సంగమానికి ఆటంకం ఏర్పడుతోంది. అడవిలోని గొడ్డలి చప్పుళ్లకు పులులు సంగమించడం లేదు. అడవిలోని శబ్దాలకు పులులు, ఇతర జంతువులు జనారణ్యంలోకి వస్తుంటాయని చెబుతున్నారు.

త్రిపురాంతకంలో శ్రావణ శోభ



త్రిపురాంతకం శ్రీబాలాత్రిపురసుందరీదేవి మూలవిరాట్

త్రిపురాంతకం: జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన త్రిపురాంతకంలోని శ్రీబాలా త్రిపురసుందరీదేవి ఆలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారి ఆలయానికి పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులు కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. శ్రావణ మాసంలో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య అధికంగా ఉంటుంది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు శ్రావణ మాసంలో వచ్చి అమ్మవారికి అర్చనలు, ప్రత్యేక పూజలు చేస్తుంటారు. ప్రత్యేక పూజలను అర్చకుడు ప్రసాదశర్మ నిర్వహించగా ఆలయాల ఈఓ చెన్నకేశవరెడ్డి భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు.



కుంకుమార్చనలు చేస్తున్న భక్తులు

అభివృద్ధి, సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం

- అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు
- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు సిటీ: అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఒంగోలు నగరంలోని గోపాలనగర్ నాలుగో లైన్‌లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఇంటింటికీ తిరుగుతూ సంక్షేమ పథకాల గురించి లబ్ధిదారులకు బాలినేని శ్రీనివాసరెడ్డి వివరించారు. లక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక మహిళలు హారతులు, పూలతో బాలినేనికి ఘనంగా స్వాగతం పలికారు, ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని సక్రమంగా అమలు చేయకపోగా మహిళలు, రైతులను నిట్టనిలువునా మోసం చేశారని విమర్శించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సంక్షేమ పథకాలను ప్రజల ముంగిటకే అందిస్తూ ముందుకు దూసుకుపోతున్నారని కొనియాడారు. కుల, మత, వర్గ భేదాలు లేకుండా అర్హతే కొలమానంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడమే కాకుండా ఇళ్లు కట్టుకునేందుకు ప్రభుత్వం రుణం మంజూరు చేస్తుందన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి టీడీపీ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందేవని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేయడమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. గడప గడపలో లబ్ధిదారులు చూపిస్తున్న అభిమానం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఒంగోలు కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత, ఒడా చైర్‌పర్సన్ సింగరాజు మీనా వెంకటరావు, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ ఎండేటి పద్మావతి రంగారావు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, కార్పొరేటర్ తాడి కృష్ణలత, జిల్లా మహిళా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, డివిజన్ అధ్యక్షులు సత్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వీర్రాజు, తాళ్ళపాలెం శ్రీను, పల్లెపోతు మోహనరావు, వాకా తిరుమలరావు, జమ్ము శ్రీకాంత్, మిరియం వెంకటేశ్వర్లు, రావులపల్లి శ్రీకాంత్, సాహిత్య అకాడమీ డైరెక్టరు బొప్పరాజు జ్యోతి, గొర్రెపాటి శ్రీను, డివిజన్ నాయకులు గుర్రం వెంకన్న, పటాపంజుల శ్రీను, సైదా, తదితరులు పాల్గొన్నారు.

స్వల్పకాలంలోనే ఘన కీర్తి.. ముందుంది మహాదీప్తి



సచివాలయాల కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావించి 12 ఏళ్ల స్వల్ప కాలంలోనే ఘన కీర్తి సాధించిందని, మున్ముందు మహాదీప్తిగా సాగిపోతుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో శుక్రవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆవిర్భవించిన తరువాత 2014లో సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొని ప్రతిపక్ష హోదాలో ప్రజల పక్షాన నిలిచి హుందాతనంగా పోరాటాలు చేశామని, 2019 ఎన్నికల్లో ఘనవిజయం సాధించామని అన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన 4 సంవత్సరాల 4 నెలల కాలంలో దేశంలో ఎక్కడా లేనివిధంగా పథకాలను ప్రవేశపెట్టి ఘనకీర్తి సాధించారని, రాష్ట్ర ప్రజల మన్ననలు పొందారని అన్నారు. పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలకు సేవలు అందించే కార్యకర్తలు, నాయకుల కష్ట ఫలితంగానే ప్రభుత్వానికి మంచి పేరు వచ్చిందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న 5 కోట్ల మంది ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి సీఎం కావాలని కోరుకుంటున్నారని, ఆ దిశగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని కోరారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పించేందుకు జగనన్న సిద్ధంగా ఉన్నారని, ప్రతి నియోజకవర్గంపై ఆయన దృష్టిపెట్టి ఆయా ప్రాంతాల పార్టీ కార్యక్రమాలను సమీక్షిస్తున్నారని చెప్పారు. పార్టీ తరఫున గృహసారథులకు బీమా పథకాన్ని వర్తింపచేయడం హర్షించదగిన విషయమని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీలు చేదూరి విజయభాస్కర్, వాగ్యానాయక్, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ మజీద్, పార్టీ అధ్యక్షులు కె.ఓబులరెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, పోలిరెడ్డి, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములునాయక్, సచివాలయాల మండల కన్వీనర్లు సయ్యద్ జబీవుల్లా, ఎల్లారెడ్డి, వెంకటేశ్వర్లు, సర్పంచ్ అరుణాబాయి పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల పట్టాలు



ఫొటో జర్నలిస్టులు, మీడియా కెమెరామెన్‌లను సన్మానించిన ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత తదితరులు

- మాజీమంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరంలో పనిచేస్తున్న అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామని మాజీమంత్రి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలిపారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫోరం ఆధ్వర్యంలో రాంనగర్‌లోని ఆర్కిట్ టెక్నో స్కూలులో మీడియా ఫొటోగ్రాఫర్లు, మీడియా జర్నలిస్టుల సత్కారసభ నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు జి.శివాజి సభకు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ప్రసంగిస్తూ.. జర్నలిస్టులకు ఎప్పుడూ అండగా ఉంటానని చెప్పారు. ఒంగోలు నగరంలో త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అప్పుడు అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. వార్తల్లో వాస్తవాల కంటే వక్రీకరణలే అధికంగా ఉంటున్నాయని, ప్రజల్లో గందరగోళం సృష్టించే దురుద్దేశంతో వార్తలు రాయడం ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాలినేనిని స్కూలు విద్యార్థినులు ఘనంగా సత్కరించారు. వేగంగా మారిపోతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని జర్నలిస్టులు అందిపుచ్చుకోవాలని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. జర్నలిజంలో ఫొటో జర్నలిస్టులు కీలకపాత్ర పోషిస్తున్నారని ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి చెప్పారు. అనంతరం మీడియా ఫొటోగ్రాఫర్లు, వీడియో జర్నలిస్టులను ఘనంగా సత్కరించారు. ఈ సభలో చదలవాడ పశుక్షేత్రం డిప్యూటీ డైరెక్టర్ డా.బి.రవి, ఆర్కిట్స్ టెక్నో స్కూలు కరస్పాండెంట్ అజయ్ బాబు, డీజేఎఫ్ నాయకులు, మీడియా ఫొటోగ్రాఫర్లు, వీడియో జర్నలిస్టులు పాల్గొన్నారు.

పండుగ వాతావరణంలో గృహప్రవేశాలు

- 30న కేవీ పాలెం జగనన్న కాలనీలో జిల్లా స్థాయి గృహ ప్రవేశాల కార్యక్రమం



ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

చీమకుర్తి: జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలను ఈనెల 30న పండుగ వాతావరణంలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని కేవీ పాలెం జగనన్న కాలనీ లే అవుట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 30న రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల ఇళ్లను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధం చేసిందన్నారు. దానిలో భాగంగా మన జిల్లా స్థాయిలో నిర్వహించే కార్యక్రమాన్ని చీమకుర్తి మున్సిపాలిటీలోని కేవీ పాలెం జగనన్న కాలనీలో ఈనెల 30న ప్రారంభించనున్నట్లు తెలిపారు. కేవీ పాలెం లేఅవుట్‌లో మొత్తం 576 ఇళ్లు మంజూరు చేయగా వాటిలో ఇప్పటికి 282 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారన్నారు. మరో 88 ఇళ్లు పురోగతిలో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ పేరయ్య, పబ్లిక్ హెల్త్ ఈఈ అలీ, తహసీల్దార్ పీ.మధుసూదన్‌రావు, మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

స్వయంగా వంటచేసి వడ్డించి..

- బాలికల సంక్షేమ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ
- చేసిన చికెన్ చాలకపోవడంతో అప్పటికప్పుడు తెప్పించి పెట్టిన వైనం



చికెన్ ముక్కలను వంటపాత్రలో వేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

చీమకుర్తి: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆడపిల్లల పట్ల తన తల్లి మనస్సును చాటుకున్నారు. శుక్రవారం సాయంత్రం 6.30 గంటలకు చీమకుర్తిలోని బాలికల హాస్టల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. మెనూ ప్రకారం హాస్టల్ బాలికలకు చికెన్ కర్రీతో బిర్యానీ పెట్టాలి. హాస్టల్ సిబ్బంది తయారు చేసిన చికెన్ కర్రీని బూచేపల్లి వెంకాయమ్మ స్వయంగా బాలికలకు వడ్డించారు. ఇంకా తినాల్సిన బాలికలు సగం మంది ఉండటంతో పిల్లల ముఖాలు చూసి ఖాళీ కడుపుతో ఎలా ఉంటారని ఆవేదన వ్యక్తం చేసి తన సిబ్బందితో అప్పటికప్పుడు చికెన్ తెప్పించి వంటచేసి పిల్లలకు పెట్టారు. దాంతో బాలికలు సంతోషంగా ఆమెకు ధన్యవాదాలు తెలిపారు. పదో తరగతి విద్యార్థిని మరియమ్మ పుట్టిన రోజు కావడంతో జెడ్పీ చైర్‌పర్సన్ కేకు కట్‌చేసి విద్యార్థినికి పెట్టారు. హాస్టల్ బాలికలందరికీ చాక్‌లెట్లను తెప్పించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో ఉన్న వార్డెన్ ఇన్‌చార్జి కావడంతో పర్మినెంట్ వార్డెన్‌ను నియమించేందుకు జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడతానని చెప్పారు. దానితో పాటు 80 మంది పిల్లలకు మాత్రమే సరిపోయే సామర్థ్యం ఉన్న హాస్టల్‌లో దాదాపు 160 మంది బాలికలు ఉండటానికి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పటంతో బాలికల కోసం హాస్టల్–2ను మంజూరు చేయించేందుకు చర్యలు తీసుకుంటానని ఆమె భరోసా ఇచ్చారు. ఆమె వెంట జెడ్పీటీసీ సభ్యులు వేమా శ్రీనివాసరావు, కౌన్సిలర్‌లు పాలపర్తి వెంకట్రావు, గోపురపు చంద్ర, బాలు ఉన్నారు.

క్లుప్తంగా

డిప్యూటీ కలెక్టర్‌గా ఎస్టీఎఫ్ ఎస్సై స్వాతి

● ఏపీపీఎస్సీలో 8వ ర్యాంకు



డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైన స్వాతి

ఒంగోలు టౌన్: ఒంగోలుకు చెందిన కొమ్ము స్వాతి డిప్యూటీ కలెక్టర్‌గా గ్రూప్ వన్ ఉద్యోగానికి ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆమె తిరుపతి స్పెషల్ బ్రాంచి ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ ఎంపిక కోసం 2018లో నిర్వహించిన పరీక్షల్లో ఆమె స్టేట్ 8వ ర్యాంకు సాధించారు. తాజాగా జరిగిన ఏపీపీఎస్సీ ఫలితాల్లో కూడా స్టేట్ 8వ ర్యాంకు సాధించడం విశేషం. స్వాతి స్వగ్రామం సత్యసాయి జిల్లా హిందూపురం పరిగి మండలం. వ్యవసాయ కుటుంబానికి చెందిన కొల్లారి నాగరాజు, రత్నమ్మ దంపతులకు ఇద్దరు సంతానం కాగా స్వాతి పెద్ద కుమార్తె. ఒంగోలుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కొమ్ము మహేష్‌తో ఆమెకు వివాహమైంది. ప్రకాశం జిల్లా నుంచి గ్రూపు వన్‌కు ఎంపికైన వారిలో డిప్యూటీ కలెక్టర్‌గా ఎంపికైంది స్వాతి ఒక్కరే కావడం మరో విశేషం.

పుల్లలచెరువు
ఉపాధ్యాయులపై కేసు నమోదు

పుల్లలచెరువు: స్థానిక జెడ్పీ హైస్కూల్లో విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఇద్దరు ఉపాధ్యాయులకు గురువారం తల్లిదండ్రులు, గ్రామస్తులు దేహశుద్ధి చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం ఆ ఇద్దరు ఉపాధ్యాయులపై కేసు నమోదు చేసినట్లు మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి తెలిపారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం ట్రైనీ ఐపీఎస్ అంకితాసురానా, మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి, వై.పాలెం సీఐ మారుతీకృష్ణ పుల్లలచెరువు జెడ్పీ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులను విడివిడిగా విచారించి నివేదికలు తయారు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ జరిగిన సంఘటనకు కేవలం ఉపాధ్యాయుల మధ్య అవగాహన లోపమే కారణమన్నారు. ఉపాధ్యాయులు మంచి వాతావరణంలో విద్యార్థులకు విద్యాబోధన చేయాలన్నారు. విద్యార్థులకు నష్టం కలిగించే పనులు చేస్తే ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. ఉపాధ్యాయులపై కేసు నమోదు చేసి పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తామని చెప్పారు. వారి వెంట ఎస్సై శ్రీహరి, ఎంఈవోలు శామ్యూల్ జాన్, ఇందిరాప్రసాద్ ఉన్నారు. తహసీల్దార్ దాసు పాఠశాలను సందర్శించి వివరాలడిగి తెలుసుకున్నారు.

సర్వేయర్లకు మెడికల్ కిట్లు అందజేత

ఒంగోలు అర్బన్: సర్వే సెటిల్ మెంట్స్ కమిషనర్ ఆదేశాల మేరకు సచివాలయాల సర్వేయర్లకు జిల్లా సర్వే, ల్యాండ్స్ రికార్డ్ అధికారి ఆధ్వర్యంలో శుక్రవారం స్పందన భవనంలో కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు చేతుల మీదుగా మెడికల్ కిట్లు అందించారు. సర్వేయర్ల విధి నిర్వహణలో జరిగే చిన్న ప్రమాదాలను నివారించేందుకు డీఎస్ఎల్ఓలకు కేటాయించిన నిధులతో మెడికల్ కిట్లు కొనుగోలు పంపిణీ చేశారు.

స్కీం లేకున్నా.. నగదు సేఫ్

● వాటర్‌షెడ్ స్కీం టైం పూర్తి కావడంతో నిలిపివేసిన కేంద్ర ప్రభుత్వం
● యంత్ర పరికరాల కోసం రైతులు చెల్లించిన కాంట్రిబ్యూషన్ నగదు పదిలం
● రైతులు గ్రామ పంచాయతీల వారీగా వెళితే ఇచ్చేందుకు అధికారులు సిద్ధం

కురిచేడు: కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో పాటు వాటర్‌షెడ్ ఇంటిగ్రేటెడ్ వాటర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం (ఐడబ్ల్యూఎంపీ) ను 2011–12 నుంచి ఆరేళ్ల కాల వ్యవధితో ప్రారంభించింది. కానీ కాలవ్యవధి 2018–19 తో పూర్తయింది. దాంతో కేంద్ర ప్రభుత్వం వాటర్‌షెడ్ లోని సిబ్బందిని ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లోకి తీసుకుని వాటర్‌షెడ్ ప్రోగ్రాంను పూర్తిగా నిలిపివేసింది. ఇది అమల్లో ఉన్న సమయంలో ఆయా వాటర్‌షెడ్‌ల పరిధిలోని రైతులకు థైవాన్ స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టలు, పైపులు వంటివి రాయితీపై సమకూర్చింది. కార్యక్రమం నిర్వహణలో ఉన్న సమయంలో రైతులు వాటిని పొందారు. అయితే మండలంలోని పడమర వీరాయపాలెం పంచాయతీ పరిధిలో 26 మంది, కురిచేడు గ్రామ పంచాయతీ పరిధిలో 28 మంది మొత్తం 54 మంది రైతులు 2020లో రైతుల కాంట్రిబ్యూషన్ కింద రూ. 2.35 లక్షలు డీడీలు తీసి దరఖాస్తు చేసుకున్నారు. వారికి ప్రోగ్రాం నిలిచిపోవటంతో పరికరాలు రాలేదు. అందుకే అధికారులు ఆ నగదును తిరిగి తీసుకెళ్లాలని సమాచారం ఇచ్చినా రైతుల నుంచి స్పందన రాలేదు. ఆలస్యంగా అయినా వస్తాయనే భావనతో రైతులు ఉండి పోయారు. ఆ విధంగా రైతులు చెల్లించిన నగదు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఒంగోలు బ్యాంకు ఖాతాలో నేటికీ భద్రంగా ఉన్నాయి. ×నగదు రాక.. పరికరాలు ఇవ్వక× అన్న శీర్షికన ఈనాడు పత్రికలో ప్రచురితమైన వార్తా కథనానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ శీనా రెడ్డి వాస్తవాలను వెల్లడించారు. ఆ నగదు తన ఖాతాలో భద్రంగా ఉందని, రైతులు చెల్లించిన డీడీలకు కాలపరిమితి ముగియటంతో డీడీలు తిరిగి చెల్లించలేమని, అవి చెల్లించిన రైతులు వారి ఆధార్‌కార్డు, బ్యాంకు వివరాలతో ఒంగోలు పీడీ కార్యాలయానికి వస్తే సరిచూసి వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని తెలిపారు. ఈ విషయాన్ని మండలంలోని కురిచేడు, పడమర వీరాయపాలెం పంచాయతీల్లోని రైతులు గమనించి వారి నగదు తీసుకోవాలని ఆయన కోరారు.

పాకల.. కళకళ..!

● అభివృద్ధి బాటలో పాకల పంచాయతీ
● రూ.7.33 కోట్లతో అభివృద్ధి పనులు
● రూ.3.21 కోట్లతో సిమెంటు రోడ్లు, భవనాలు
● రూ.55 లక్షలతో మురుగు కాలువలు
● రూ.2.32 కోట్లతో పాఠశాలల్లో నాడు-నేడు పనులు
● రూ.1.25 కోట్లతో తారురోడ్ల నిర్మాణం
● హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజానీకం



పల్లెపాలెంలో నిర్మించిన మురుగు కాలువ



పల్లెపాలెంలో నిర్మించిన సిమెంటు రోడ్డు

సింగరాయకొండ: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుండటంతో మండలంలోని పాకల గ్రామం అన్ని రకాల వసతులతో కళకళలాడుతోంది. ముఖ్యంగా రోడ్లు, పక్కా భవనాలు, పాఠశాలల అభివృద్ధికి కోట్లాది రూపాయలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేటాయించి పనులు ప్రారంభించి పూర్తి చేశారు. ఫలితంగా పాకల పంచాయతీలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 7.33 కోట్ల రూపాయలతో పలు అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేశారు. గ్రామాభివృద్ధికి పెద్దపీట వేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడ చూసినా సిమెంటు రోడ్లు, పక్కా భవనాలు...

పాకల గ్రామంలో 188.60 లక్షల రూపాయలతో రెండు గ్రామ సచివాలయ భవనాలు, రెండు రైతు భరోసా కేంద్రాలు, రెండు హెల్త్ సెంటర్లు, ఒక మిల్క్ సెంటర్, అంబేడ్కర్‌నగర్‌లో మహిళా సంక్షేమ భవనం నిర్మించారు. ఈ భవనాన్ని సామాజిక అవసరాలకు ఉపయోగిస్తున్నారు. రూ.1.33 కోట్లతో సిమెంటు రోడ్లు నిర్మించారు. ముఖ్యంగా పల్లెపాలెంలో రూ.34 లక్షలతో బీచ్‌కు వెళ్లేందుకు వీలుగా సిమెంటు రోడ్డు, ఎస్సీకాలనీ సమీపంలో రూ.16 లక్షలతో, చెల్లెమ్మగారిపట్టపుపాలెంలో రూ.30 లక్షలతో, క్రాంతినగర్‌లో రూ.30 లక్షలతో, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో రూ.20 లక్షలతో సిమెంటు రోడ్లు నిర్మించారు.

పెద్ద ఎత్తున మురుగు కాలువల నిర్మాణం...

గ్రామంలోని పల్లెపాలెం, క్రాంతినగర్‌లో రూ.55 లక్షలతో మురుగుకాలువలు నిర్మించారు. గతంలో ఈ రెండు పాలేల్లో మురుగుకాలువలు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గత ప్రభుత్వాలు కాలువలకు ప్రాధాన్యత ఇవ్వలేదని మత్స్యకారులు ఆరోపిస్తుండగా, ప్రస్తుతం పల్లెపాలెంలో రూ.27 లక్షలతో, క్రాంతినగర్‌లో రూ.28 లక్షలతో మురుగు కాలువలు నిర్మించారు.

తారు రోడ్లు సైతం నిర్మాణం...

పాకల పంచాయతీ పరిధిలో నాబార్డు నిధులతో సింగరాయకొండ నుంచి పాకల వరకు రూ.75 లక్షలతో తారురోడ్డు నిర్మించారు. పాకల నుంచి ఊళ్లపాలెం వరకు రూ.50 లక్షలతో తారురోడ్డు నిర్మించారు. పర్యాటక రంగంగా అభివృద్ధి చెందుతున్న పాకలలో తారురోడ్ల నిర్మాణం ఎంతో ఉపయోగకరం కాగా, పాకల బీచ్ అభివృద్ధికి కూడా ప్రభుత్వం 10 ఎకరాలు కేటాయించింది. బీచ్‌ను అభివృద్ధి చేసేందుకు అవసరమైన నిధుల కోసం సర్వే బృందాన్ని ప్రభుత్వం నియమించి నివేదిక సిద్ధం చేసింది.

నాడు-నేడుతో పాఠశాలల అభివృద్ధి...

పాకల పంచాయతీలో నాడు-నేడు పథకం కింద ఫేజ్-1, 2లో పాఠశాలల అభివృద్ధికి రూ.2.32 కోట్లను ప్రభుత్వం కేటాయించింది. వాటితో చేపట్టిన అభివృద్ధి పనులు ప్రస్తుతం ముమ్మరంగా జరుగుతున్నాయి. దీంతో పాఠశాలల రూపురేఖలు మారి కార్పొరేట్ తరహాలో విద్యార్థులకు అవసరమైన అన్నిరకాల వసతులు కల్పించబడ్డాయి. అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇదే అభివృద్ధి కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వల్లే సాధ్యమని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు వివరించారు.



పాకలలో నిర్మించిన గ్రామ సచివాలయ భవనం



రైతు భరోసా కేంద్ర భవనం

సచివాలయాల సేవలు బాగున్నాయి :



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు సత్వరమే సేవలందుతున్నాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సకలం సమకూరుస్తున్నారు. సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు ఇస్తుండటంతో పాటు ల్యాబ్‌ల ద్వారా భూసార పరీక్షలు చేయిస్తూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది.

నాయుడు రవి, మత్స్యకారుడు, పాకల

మౌలిక వసతులన్నీ కల్పించారు :



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పల్లెపాలెంలో రూ.37 లక్షలతో సిమెంటు రోడ్లు, రూ.27 లక్షలతో మురుగుకాలువలు నిర్మించారు. నాడు-నేడు పథకం కింద ప్రాథమిక పాఠశాలలో మౌలిక వసతులు కల్పించారు.

గొల్లపోతు గోవర్ధన్, మత్స్యకార నాయకుడు, పాకల పల్లెపాలెం

పక్కాగా ఎన్నికల బందోబస్తు



పోలీసులకు సూచనలిస్తున్న సీఐ రంగనాథ్

● సింగరాయకొండ సీఐ రంగనాథ్

సింగరాయకొండ: పంచాయతీ ఉప ఎన్నికల్లో భాగంగా శనివారం పోలింగ్ జరగనున్న నేపథ్యంలో బందోబస్తును పక్కాగా నిర్వహించాలని సింగరాయకొండ సీఐ దాచేపల్లి రంగనాథ్ సిబ్బందికి సూచించారు. ఎన్నికల్లో శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు. సింగరాయకొండ మండలంలోని పాకల సర్పంచ్, సింగరాయకొండ 16వ వార్డు, మూలగుంటపాడు 10వ వార్డుకు శనివారం పోలింగ్ జరగనున్న సందర్భంగా శుక్రవారం పోలీసు సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో సీఐ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా 144 సెక్షన్ అమలులో ఉందని, పోలింగ్ కేంద్రాల వద్ద ఎవరూ గుమికూడకుండా చూడాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి ఆధ్వర్యంలో ముగ్గురు సీఐలు, 11 మంది ఎస్సైలు, 145 మంది పోలీసులు, రిజర్వ్ స్పెషల్ ఫోర్స్ పోలీసులు బందోబస్తు నిర్వహిస్తారని తెలిపారు.

బ్యాలెట్ సామగ్రి పంపిణీ చేసిన ఎంపీడీవో...



ఎన్నికల సామగ్రి తీసుకెళ్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారులు

సింగరాయకొండ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో షేక్ జమీఉల్లా ఆధ్వర్యంలో ఎన్నికల అధికారులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారులకు సంబంధిత సామగ్రి పంపిణీ చేయగా, ఆ సామగ్రి తీసుకుని ఆయా కేంద్రాలకు ఎన్నికల అధికారులు చేరుకున్నారు. శనివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగుతుందని, మధ్యాహ్నం 2 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభమవుతుందని ఎంపీడీఓ వివరించారు. పాకల సర్పంచ్ పదవికి పాకల జెడ్పీ బాలికల హైస్కూల్లో, మూలగుంటపాడు 10వ వార్డుకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, సింగరాయకొండ 16వ వార్డుకు ఆర్ఎస్ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ జరుగుతుందని తెలిపారు. ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి

యర్రగొండపాలెం: బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో మృతిచెందిన సంఘటన త్రిపురాంతకం మండలం దూపాడు సాగర్ కాలువ సమీపంలో హైవేపై శుక్రవారం జరిగింది. కర్నూలు నుంచి విశాఖపట్నం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురుగా వస్తున్న మోటారు బైక్‌ను ఢీకొనడంతో బైక్ నడుపుతున్న పసల మర్రయ్య (50) అక్కడికక్కడే మృతి చెందాడు. నల్గొండ జిల్లా మోట కొండూరుకు చెందిన మర్రయ్య దొనకొండ మండలంలోని సిద్ధయ్యపాలెంలో పాస్టర్‌గా ఉంటున్నాడు. పని నిమిత్తం మార్కాపురం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

ట్యూషన్ పేరుతో బాలికపై లైంగికదాడి

● ప్రైవేటు టీచర్ అరెస్టు ● పోక్సో కేసు నమోదు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి

ఒంగోలు టౌన్: ఎంతో పవిత్రమైన ఉపాధ్యాయవృత్తిని కొందరు కీచకులు భ్రష్టుపట్టిస్తున్నారు. ప్రేమ పేరుతో ఒక బాలికకు మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడ్డాడు ఓ ప్రైవేటు ఉపాధ్యాయుడు. ఒంగోలు తాలూకా పోలీసుస్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి ఆ వివరాలు వెల్లడించారు. ఒంగోలు నగరంలోని శివప్రసాద్‌కాలనీలో నివాసం ఉండే జగన్నాథం సునీల్‌కుమార్ ప్రైవేటుగా ట్యూషన్లు చెబుతుంటాడు. అతడి దగ్గరకు మూడు సంవత్సరాలుగా ఒక బాలిక ట్యూషన్‌కు వెళ్తోంది. ఆమెపై కన్నేసిన కీచక మాస్టారు చనువు పెంచుకున్నాడు. మాయమాటలు చెప్పి లోబరుచుకున్నాడు. బాలికపై లైంగికదాడికి పాల్పడ్డాడు. వారిద్దరి ఫొటోలు సెల్ఫీ తీసుకున్నాడు. బాలిక దగ్గర ఉన్న ఉంగరాన్ని తీసుకున్నాడు. ఈ మొత్తం వ్యవహారానికి ఆ టీచర్ తల్లిదండ్రులు సైతం సహకరించినట్లు బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొనడం గమనార్హం. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోక్సో, లైంగికదాడి కేసును తాలూకా పోలీసులు నమోదు చేశారు. శుక్రవారం మధ్యాహ్నం నగరంలోని మంగమూరు రోడ్డులో మర్రిచెట్టు సెంటర్ వద్ద నిందితుడిని అరెస్టు చేశారు. అతని తల్లిదండ్రుల పాత్రపై కూడా విచారణ జరుపుతున్నామని, సాక్ష్యాధారాలను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో తాలూకా సీఐ పి.భక్తవత్సలరెడ్డి పాల్గొన్నారు.

కర్నూల్ ఘాట్‌లో ప్రమాదం

● ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న గుర్తు తెలియని వాహనం ● యువకుడు దుర్మరణం ● ఒకరికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన రాజా

పెద్దదోర్నాల: గుర్తు తెలియని వాహనం ద్విచక్రవాహనాన్ని ఢీ కొన్న ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన శుక్రవారం కర్నూల్ రోడ్డులోని చెంచుకుంట వద్ద చోటు చేసుకుంది. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న కర్నూల్ జిల్లా శ్రీశైలం ప్రాజెక్టుకు చెందిన రాజా మృతి చెందగా, నర్సింహులు అనే వ్యక్తికి గాయాలయ్యాయి. ఎస్సై అంకమరావు కథనం మేరకు.. శ్రీశైలం ప్రాజెక్టు చెందిన రాజా, నర్సింహులు ఆత్మకూర్‌లో వ్యక్తి గత పనులు ముగించుకుని తిరిగి శ్రీశైలం వెళుతుండగా.. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. రాజా మృతి చెందగా.. 108 సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలికి చేరుకుని తీవ్ర గాయాల పాలైన క్షతగాత్రుడిని పెద్దదోర్నాల వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు.

నియామక పత్రాలు అందజేత

● గ్రూప్-4 ఉద్యోగాలకు ఎంపికైన వారికి పలు సూచనలు

ఒంగోలు అర్బన్: ప్రభుత్వ సర్వీసుల్లో ఉన్న వారు చిత్తశుద్ధితో, సేవా దృక్పథంతో పనిచేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. ఏపీపీఎస్సీ ద్వారా జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ అసిస్టెంట్ వంటి గ్రూప్-4 ఉద్యోగాలకు ఎంపికైన 52 మందికి శుక్రవారం స్పందన భవనంలో కలెక్టర్ నియామక పత్రాలు అందచేసి అభినందించారు. పోటీ పరీక్షల్లో నెగ్గి ప్రభుత్వ ఉద్యోగులుగా ఎంపికైన యువత విధుల నిర్వహణలో, అదే స్ఫూర్తితో పనిచేయాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్ఓ శ్రీలత, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
ఒంగోలు
శనివారం ॥ 19-8-2023

"ఏమేమి పువ్వొప్పనే గౌరమ్మ...
ఏమేమి కాయొప్పనే గౌరమ్మ!
తంగేడు పువ్వులో... తంగేడు కాయలో...
ఆట చిలుకలు రెండు... పాట చిలుకలు రెండు..."

* * *

"చిత్తూ చిత్తుల బొమ్మ శివుని ముద్దులగుమ్మ
బంగారు బొమ్మ దొరికేనమ్మా ఈ వాడలోన..."



బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో! అమెరికా బతుకమ్మ ఉయ్యాలో!!

''ఇలా ఒకటా... రెండా... లెక్కలేనన్ని బతుకమ్మ పాటలు మా నాలుకల మీద నాట్యమాడుతుంటాయి. గ్రామాల్లో గడిచిన బాల్యం జీవితాన్ని నేర్పుతుంది. తెలంగాణ గ్రామాల్లో బాల్యం బతుకమ్మ పాటల రూపంలో సమాజంలో జీవించడాన్ని నేర్పుతుంది. నిరక్షరాస్యులు కూడా ఈ పాటలను లయబద్ధంగా పాడతారు. బతుకమ్మ పాటల సాహిత్యం వాళ్ల నాలుకల మీద ఒదిగిపోయింది. తమకు తెలిసిన చిన్న చిన్న పదాలతో జీవితాన్ని అల్లేశారు గ్రామీణ మహిళలు. మా నాన్న ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఇంజనీర్. మా అమ్మమ్మ గారి ఊరు జగిత్యాల జిల్లా, వెలుగుమాట్ల. నా చదువు పుట్టపర్తిలో, సెలవులు అమ్మమ్మ ఊరిలో. దసరా సెలవులు వస్తున్నాయంటే సంతోషం అంతా ఇంతా కాదు. దేశమంతా దేవీ నవరాత్రులు జరుపుకుంటూ ఉంటే మేము బతుకమ్మ వేడుకలు చేసుకుంటాం. గౌరమ్మ అందరి మనసుల్లో కొలువుంటుంది, మాట, పాట, ఆట అన్నీ గౌరమ్మ కోసమే అన్నట్లు ఉంటుందీ వేడుక. ఇంత గొప్ప వేడుకకు దూరమయ్యానని అమెరికా వెళ్లిన తర్వాత కానీ తెలియలేదు. అందుకే అమెరికాలో బతుకమ్మను పేర్చాను'' అన్నారు దీప్తి మామిడి... కాదు, కాదు, బతుకమ్మ దీప్తి.

''నేను 2007లో యూఎస్‌కి వెళ్లాను. న్యూజెర్సీలో ఉండే వాళ్లం. పెళ్లయి, ఒక బిడ్డకు తల్లిని. భర్త, పాప, ప్రొఫెషన్‌తో రోజులు బిజీగా గడిచి పోయేవి. డబ్బు కూడా బాగా కనిపించేది. కొద్ది నెలల్లోనే... ఏదో మిస్సవుతున్నామనే బెంగ మొదలైంది. వ్యాక్యూమ్ ఏమిటనేది స్పష్టంగా తెలియలేదు, కానీ బాల్యం, సెలవుల్లో బతుకమ్మ వేడుక మరీ మరీ గుర్తుకు వస్తుండేది. బతుకమ్మ కోసం ఇండియాకి రావడం కుదరకపోతే నేనున్న చోటే బతుకమ్మ వేడుక చేసుకోవచ్చు కదా! అనిపించింది. అలా అక్కడున్న తెలుగువాళ్లను ఆహ్వానించి బతుకమ్మ వేడుక చేశాను. మొదటి ఏడాది పదిహేను మందికి లోపే... పదేళ్లు దాటేసరికి ఆ నంబరు ఐదారు వందలకు చేరింది. అందరికీ భోజనాలు మా ఇంట్లోనే. ఏటా ఒక పెళ్లి చేసినట్లు ఉండేది. ఇండియా నుంచి తెలంగాణ పిండివంటలను తెప్పించుకోవడం, ఆ రోజు వండుకోవాల్సినవన్నీ మా ఇంట్లోనే వండడం, ఆ వంటల కోసం దినుసులను సేకరించడం, స్నేహితులందరినీ ఆహ్వానించడం, పూలు తెచ్చుకుని ఒక్కొక్కటీ పేర్చడం... ఇలా ప్రతి ఘట్టాన్నీ ఎంజాయ్ చేసేదాన్ని. 'ఏటా అంతంత ఖర్చు ఎందుకు' అని స్నేహితులు అనేవాళ్లే కానీ మా వారు ఒక్కసారి కూడా అడగలేదు. నా సంతోషం కోసం చేసుకుంటున్న ఖర్చు అని అర్థం చేసుకునేవారు.


దీప్తి మామిడి

ఎప్పుడూ అన్నం ఉంటుంది!

యూఎస్‌లో మా ఇంట్లో డైనింగ్ టేబుల్ మీద ఎప్పుడూ అన్నం, కూరలుండేవి. మా కన్సల్టెన్సీకి వచ్చిన వాళ్లు, ముఖ్యంగా బ్యాచిలర్స్ కోసం ఈ ఏర్పాటు. మేము యూఎస్‌లో అడుగుపెట్టిన కొన్నాళ్లకే రెసిషన్ వచ్చింది. అప్పుడు పడిన ఇబ్బందులు నాకిప్పటికీ గుర్తే. అందుకే యూఎస్‌కి వచ్చిన కుర్రాళ్లు మన తెలుగింటి రుచులతో భోజనం చేస్తారు కదా! అనుకునేదాన్ని. షడ్రసోపేతమైన భోజనం అని కాదు కానీ కనీసం పప్పు చారయినా ఉండేది. ఈ అలవాటుకు బీజం పడింది కూడా అమ్మమ్మ దగ్గరే. అమ్మమ్మ పెద్ద పాత్రలో అంబలి చేయించి ఇంటి ముందు పెట్టేది. చాలామంది పొలం పనులకు వెళ్తూ దారిలో మా ఇంటి ముందాగి అంబలి తాగి, ఆవకాయ ముక్క చప్పరించుకుంటూ వెళ్లేవాళ్లు. ఆకలి తీర్చడంలో, అవసరమైన వాళ్లకు సహాయం చేయడంలో ఉండే సంతృప్తి మరి దేనిలోనూ ఉండదు. మా డ్రైవర్ ఇతర పనివాళ్ల పిల్లల చదువు కోసం ఫీజులు కట్టినప్పుడు మరొకరి జీవితానికి మనవంతు సహాయం చేస్తున్నామనే భావన సంతృప్తినిస్తుంది. అవకాశం లేనప్పుడు ఎలాగూ చేయలేం, వెసులుబాటు ఉన్నప్పుడయినా చేసి తీరాలి. మన ఎదుగుదల కోసం సమాజం నుంచి మనం తీసుకుంటాం, మనం ఎదిగిన తరవాత మరొకరి ఎదుగుదల కోసం ఆపన్న హస్తాన్ని అందించి తీరాలనేది పుట్టపర్తి స్కూల్ నేర్పించిన వాల్యూ బేస్డ్ ఎడ్యుకేషన్. మా అమ్మ ఫ్రెండ్ లీలా ఆంటీ కూడా బతుకమ్మ పండుగను బాగా చేసేవారు. ఆమె ఎన్విరాన్‌మెంట్ యాక్టివిస్ట్. గునుగుపూలు వాటర్‌బాడీస్‌ని శుద్ధి చేస్తాయని చెప్తూ ఈ పండుగ వెనుక ఉన్న పర్యావరణ పరిరక్షణను వివరించేవారు. ఇవన్నీ మైండ్‌లో ఒక్కటొక్కటిగా అల్లుకుంటూ ఇలా దండ కూర్చుకున్నాయి.

బతుకమ్మ దీప్తినయ్యాను!

యూఎస్ జీవితం నాకు చాలా నేర్పించిందనే చెప్పాలి. అక్కడ అన్నీ ఉంటాయి కానీ ఏదో లేదనే వెలితి. రొటీన్ లైఫ్‌ని జాయ్‌ఫుల్‌గా మలుచుకోవడానికి నాకు బతుకమ్మ ఒక దారి చూపించింది. అప్పట్లో యూఎస్ ఇంతగా ఇండియనైజ్ కాలేదు. ఇప్పుడైతే న్యూజెర్సీ, డాలస్‌తోపాటు కొన్ని నగరాలు పూర్తిగా భారతీయలవే అన్నట్లు, తెలుగువాళ్ల ఊళ్లే అన్నట్లయిపోయాయి. మన పండుగలు ఇప్పుడు అందరూ చేసుకుంటున్నారు. నేను మొదలుపెట్టడంతో నేను బతుకమ్మ దీప్తినయ్యాను. 'దీప్తి మామిడి'గా అమెరికాలో అడుగుపెట్టాను. మూడేళ్ల కిందట తిరిగి వచ్చేటప్పటికి నా పేరు 'బతుకమ్మ దీప్తి'గా మారింది. బతుకమ్మ పాటకు మ్యూజిక్ మొదలైతే చాలు... ఒళ్లు పులకించిపోతుంది. పూనకం వచ్చినట్లే ఉంటుంది. మీతో మాట్లాడుతున్నా సరే... బతుకమ్మ ఫీల్ వచ్చేస్తుంది. చూడండి గూజ్‌బంప్స్ వచ్చేశాయి'' అని చేతులను చూపించారు బతుకమ్మ దీప్తి.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

న్యూస్‌మేకర్ - లక్ష్మి

గిరిజన సరస్వతి

జె.ఇ.ఇ. ఎంట్రన్స్‌లో ర్యాంకు కొట్టడం సామాన్యం కాదు. అందుకై కొందరు రాజస్తాన్ వెళ్తారు. కొందరు హైదరాబాద్, విజయవాడ చేరుకుంటారు. తల్లిదండ్రులు గైడ్ చేస్తారు. కాని నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు పుట్టిన కోయ విద్యార్థిని కొర్సా లక్ష్మి గురుకుల పాఠశాలలో చదువుకునే మంచి ర్యాంకు సాధించింది. పాట్నా ఐఐటీలో సీటు సాధించింది. కోయలలో ఒక అమ్మాయి సాధించిన స్ఫూర్తినిచ్చే విజయం ఇది. కొర్సా లక్ష్మి పరిచయం.

కొంతమంది ఇళ్లల్లో, నిజానికి చాలామంది ఇళ్లల్లో పిల్లలు జె.ఇ.ఇ. ఎంట్రన్స్ రాయడానికి తల్లిదండ్రులు చాలా శ్రద్ధ పెడతారు. బాగా చదివించే కోచింగ్ సెంటర్ కోసం అవసరమైతే రాజస్థాన్‌లోని కోటాకు వెళతారు లేదా హైదరాబాద్, విజయవాడలలో ప్రఖ్యాత కోచింగ్ సెంటర్‌లలో వేస్తారు. ఇక పిల్లలు ఇంట్లో ఉండి చదువుకుంటుంటే టీవీలు బంద్ చేస్తారు. మాటా పలుకూ లేకుండా పిల్లలు ఇరవై నాలుగ్గంటలూ చదువుకునేలా చేస్తారు. మెటీరియల్ తెచ్చిస్తారు. చాలా హైరానా పడతారు. అదేం తప్పు కాదు. కాని ఇలాంటివన్నీ లేకుండా కూడా కొంతమంది విజయం సాధిస్తుంటారు. కొత్తగూడెంలోని గిరిజన గురుకుల పాఠశాలలో చదువుకున్న కోయ విద్యార్థిని కుర్సా లక్ష్మి అలాంటి విజేతే. పట్టుదలతో చదువుకుని ర్యాంకు సాధించిన విజేత.


తండ్రి కన్నయ్య, తల్లి శాంతమ్మలతో లక్ష్మి

ఐసులమ్మే తండ్రి కూతురు

కొత్తగూడెం నుంచి దాదాపు 70 కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజన తండా కాటాయగూడెం. 300 గడపలున్న గ్రామం ఇది. అందరూ కోయలే. వ్యవసాయ కూలీలే. ఏ కొద్ది మందికో కాసింత భూమి ఉంటుంది. కొర్సా లక్ష్మి తండ్రి కన్నయ్యకు ఎకరం భూమి ఉంది. కాని వాన పడితేనే పండుతుంది. కన్నయ్య వ్యవసాయ కూలీగా వెళతాడు. తల్లి శాంతమ్మ కూడా. వ్యవసాయ పనులు లేనప్పుడు తన టీవీఎస్ ఎక్సెల్ మీద ఐస్ బాక్స్ పెట్టుకుని ఐసులమ్ముతాడు. ముగ్గురు పిల్లలు. కాని పెద్ద కొడుకు చదువు ఇష్టం లేక 7వ తరగతిలో ఇంట్లో నుంచి పారిపోయాడు. రెండో కొడుకు మామూలు చదువే. చివరి అమ్మాయి లక్ష్మి బాగా చదువుకోవాలని నిశ్చయించుకుంది.

పిన్ని స్ఫూర్తి

కన్న తల్లిదండ్రులు చదువు లేని వారు కావడాన లక్ష్మికి చదువులో ఏ సాయమూ చేయలేకపోయేవారు. ఆరవ తరగతి నుంచి కొత్తగూడెం గిరిజన గురుకుల పాఠశాలలో చదువుతున్న లక్ష్మికి పిన్ని సుమలత స్ఫూర్తిగా నిలిచింది. డిగ్రీ చదువుకున్న సుమలత హాస్టల్‌లో ఉన్న లక్ష్మిని తరచూ కలుస్తూ చదువు విలువ చెబుతూ వచ్చింది. డబ్బుకు విలువ ఇవ్వని వారు కూడా చదువుకు విలువ ఇస్తారని తెలిపింది. సెలవుల్లో ఇంటికి తీసుకువచ్చి లక్ష్మి మంచి చెడ్డలు చూసేది. ఆమె మాటలు లక్ష్మి మనసులో నాటుకుపోయాయి. 'ఏ రోజూ కూడా రాత్రి ఒంటి గంట లోపు లక్ష్మి పుస్తకం మూయగా చూడలేదు' అని లక్ష్మి బాబాయ్ రవి తెలిపాడు.

గురుకుల పాఠశాలలో

కొత్తగూడెంలోని గిరిజన గురుకుల పాఠశాలలో దాదాపు వేయి మంది అమ్మాయిలు 6 నుంచి ఇంటర్ వరకూ చదువుతున్నారు. ప్రిన్సిపాల్ దేవదాసు, ఉపాధ్యాయులు వీరి చదువు మీద బాగా శ్రద్ధ పెడుతున్నారు. చురుకైన విద్యార్థినులను ఎంపిక చేసి జె.ఇ.ఇలో శిక్షణ ఇస్తున్నారు. ఇంటర్‌లో ఎం.పి.సి తీసుకున్న లక్ష్మి 992 మార్కులు సాధించింది. దాంతో ఇంకా ఉత్సాహంతో జె.ఇ.ఇకి ప్రిపేర్ అయ్యింది. జె.ఇ.ఇ అడ్వాన్స్‌డ్‌లో 1371వ ర్యాంకు సాధించింది. పాట్నా ఐ.ఐ.టిలో ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్‌లో మొన్నటి ఆగస్టు మొదటివారంలో సీటు పొందింది. గురుకుల పాఠశాల నుంచి ఈ ఘనత సాధించిన అమ్మాయి లక్ష్మే.

ఐ.ఏ.ఎస్ చేయాలని...

బాగా చదువుకుని ఐ.ఏ.ఎస్ చేయాలనేది తన లక్ష్యమని కొర్సా లక్ష్మి చెప్పింది. జె.ఇ.ఇలో మంచి ర్యాంకు సాధించి ఐ.ఐ.టిలో సీటు పొందడంతో ఐ.టి.డి.ఏ అధికారులు లక్ష్మిని ప్రశంసించారు. ట్యాబ్ ఇచ్చి ఆర్థిక సహాయం చేశారు. లక్ష్మి ఇంత బాగా చదవడంతో ఇంకా కొంతమంది ఆమె చదువును ప్రోత్సహించడానికి ముందుకొచ్చారు. ఆ ప్రోత్సాహం వల్ల లక్ష్మి ఐ.ఏ.ఎస్ చదివి పేద వర్గాల కోసం పని చేయాలని నిశ్చయించుకుంది.

నేడు వరల్డ్ ఫొటోగ్రఫీ డే



వారియర్ కెమెరా

- కర్తవ్యాన్ని గుర్తు చేసే కెమెరా కన్ను

ఆరతి కెమెరాతో మాట్లాడి చూడండి... చేపల సవ్వడి లేని నదుల దీనత్వాన్ని గురించి చెబుతుంది. చేవ లేని జీవజాలాన్ని గురించి చెబుతుంది. పచ్చదనాన్ని కోల్పోయి నేలకూలనున్న నిర్జీవ వృక్షాల మృత్యుఘోష చెబుతుంది. నదుల నీటిలోని విషాన్ని గురించి వివరంగా చెబుతుంది. స్థూలంగా చెప్పాలంటే...కనిపించే అందాల వెనుక కనిపించని నిశ్శబ్ద విధ్వంసాన్ని గురించి కళ్లకు కడుతూ చెబుతుంది. బెంగళూరుకు చెందిన ఎన్విరాన్‌మెంటల్ ఫొటోగ్రాఫర్ ఆరతి కుమార్ రావు తన కెమెరాతో పర్యావరణ సంరక్షణం గురించి క్షణం క్షణం గుర్తు చేస్తోంది...

ప్రతి కెమెరాకు ఒక దృష్టి ఉంటుంది. మరి ఆరతి కెమెరా చూసేది ఏమిటి?

అట్టడుగున పడి కన్పించని కథలు, నిజజీవిత కథలు, పట్టించుకోవాల్సిన అవసరం ఉన్నా ఎవరూ పట్టించుకోని కథలు, సంప్రదాయ జీవనశైలులు, వాటిలో వస్తున్న అనూహ్య మార్పులు, పదాలకు దొరకని దృశ్యాలు...ఇలా ఎన్నో ఎన్నెన్నో.

చిన్నప్పటి నుంచి 'నేషనల్ జియోగ్రఫి' పత్రికలను చూస్తూ పెరిగింది ఆరతి. ఆ ఎల్లో బార్డర్ విండోస్ నుంచి విశాలమైన ప్రపంచాన్ని చూసింది. ఆ పత్రికలోని ఫొటోగ్రాఫ్స్ తనపై ఎంతో ప్రభావం చూపాయి. పదాలతోనే కాదు చిత్రాలతో కూడా గొప్ప సత్యాలు చెప్పవచ్చుననే విషయం అర్థమైంది.

చిన్నప్పటి నుంచి ఫిజిక్స్ అంటే ఇష్టం ఉన్న ఆరతి బయోఫిజిక్స్‌లో మాస్టర్స్ చేసింది.

ఆ తరువాత 'లైఫ్‌టైమ్ టు–డూ' రూపంలో భవిష్యత్ కార్యాచరణను సిద్ధం చేసుకుంది. దానిలో నదులతో పరిచయం ఒకటి. నదులను, వాటి చుట్టూ ఉండే జీవితాన్ని ఫొటోల రూపంలో డాక్యుమెంట్ చేయాలనుకుంది.


ఆరతి కుమార్ రావు

కాళ్లకు బలపాలు, కళ్లకు కెమెరాలు కట్టుకొని ఊరూరు తిరిగినా తల్లిదండ్రులు ఎప్పుడూ అభ్యంతర పెట్టలేదు. పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. వివిధ ప్రాంతాలలో తన ఫొటోగ్రఫీకి సంబంధించిన విషయాలను కుటుంబసభ్యులతో పంచుకునేది ఆరతి.

ఫొటోల ద్వారా ఎన్విరాన్‌మెంటల్ స్టోరీ టెల్లింగ్‌లో నేర్పు సంపాదించిన ఆరతి తన ప్రయాణంలో ఎన్నో అనుభవాలను సొంతం చేసుకుంది. పర్యావరణం గురించి మాట్లాడే వారిని అభివృద్ధి వ్యతిరేకులుగా భావించే వారిని కూడా చూసింది.

'రివర్ డైరీస్' అనేది ఆమె ప్రస్థానంలో ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్ట్‌గా పేరు తెచ్చుకుంది. నదుల అందాలతో పాటు వాటికి ఎదురవుతున్న ఆపదలకు 'రివర్ డైరీస్' అద్దం పడతాయి.






చిత్రాలు: ప్రకృతి, ప్రకృతితో ముడిపడిన మనిషి జీవితం

'హింస, వివాదాలు మాత్రమే హెడ్‌లైన్స్‌గా కనిపిస్తాయి. అయితే పర్యావరణ విధ్వంసం అనే భయానకమైన కనిపించని హింస చాపకింద నీరులా కొనసాగుతుంది' అంటుంది ఆరతి. ఆ కనిపించని హింసమూలాలను నలుగురికి తెలియజేసేలా చేయడంలో తన కెమెరాను బలమైన మాధ్యమంగా ఉపయోగించుకుంటోంది.

ఆరతి ఫొటోగ్రాఫర్ మాత్రమే కాదు రచయిత్రి కూడా. ఆమె పుస్తకాలలో 'మార్జిన్‌ల్యాండ్స్: ఇండియన్ ల్యాండ్‌స్కేప్స్ ఆన్ ది బ్రింక్' ఒకటి. ఇందులో లడఖ్ నుంచి సుందరబన్ వరకు ప్రకృతికి సంబంధించిన ఎన్నో సుందరచిత్రాలను కళ్లకు కడుతుంది. గంగ–బ్రహ్మపుత్ర–మేఘన పరీవాహక ప్రాంతాలకు తీసుకువెళుతుంది. భౌగోళిక అందాలతో పాటు ఎదురవుతున్న ప్రమాదాలను, అక్కడి ప్రజలు మాట్లాడుకునే పదాలను పరిచయం చేస్తుంది.

'నిర్మాణాలు, ఇతరత్రా విధ్వంసక కార్యకలాపాల వల్ల ప్రమాదం అంచున ఉన్న ప్రకృతిని కాపాడు కోవడం అనేది మన చేతిలోనే ఉంది' అని ఈ పుస్తకం ద్వారా చెబుతుంది ఆరతి.

'పర్యావరణంలో వచ్చే మార్పులు, అవి మన జీవితాల్లో తెచ్చే మార్పులను నా కెమెరా ద్వారా ఇక ముందు కూడా కథలుగా చెప్పాలనుకుంటున్నాను' అంటోంది ఆరతి.

ఒకానొక సందర్భంలో తన నిరసన గళాన్ని ఇలా వినిపించింది ఆరతి,,,,

'కరువుకాటకాలు, వరదలలాంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు మాత్రమే పర్యావరణ విధ్వంసం, పరిరక్షణ గురించి మాట్లాడుకుంటారు. ఆ తరువాత ఎవరి పనుల్లో వారు మునిగిపోతారు'

అయితే ఆరతిలాంటి ఎన్విరాన్‌మెంటల్ ఫొటోగ్రాఫర్‌లు తమ చిత్రాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు సంబంధించి మన కర్తవ్యాన్ని ఎప్పటికప్పుడు గుర్తు చేస్తూనే ఉన్నారు.

కవితకేదీ కాదు అనర్హం అన్న చందాన మెటల్, ప్లాస్టిక్, పాత గాడ్జెట్స్ ఏదైనా ఆయన చేతిలో పెట్టారంటే అందమైన శిల్పంగా మారాల్సిందే. అరవైఏళ్ల వయసులో చిన్నప్పటి హాబీని కెరీర్‌గా మలుచుకున్నాడు విశ్వనాథ్ మల్లాబ్ది దావంగిరె. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకో ఆర్ట్‌గా మార్చి అబ్బురపరుస్తున్నాడు ఈ పెద్దాయన.

ఈ-వేస్ట్ శిల్పి


విశ్వనాథ్

బెంగళూరుకు చెందిన విశ్వనాథ్ తండ్రి డీఎమ్ శంభు ప్రముఖ శిల్పి ఇంకా పెయింటర్ కూడా. విశ్వనాథ్ మెడిసిన్ చదివి మంచి డాక్టర్ కావాలని శంభు కలలు కనేవారు. చిన్నప్పటి నుంచి సెకండ్ హ్యాండ్ వస్తువులను సరికొత్తగా మార్చడమంటే విశ్వనాథ్‌కు ఆసక్తి ఎక్కువ. ఫైన్ ఆర్ట్స్‌లో బ్యాచిలర్ డిగ్రీ చేయాలని నిర్ణయించుకున్నాడు.



చదువు పూర్తైన తరువాత తరువాత మీడియాలోకంప్యూటర్ వీడియో గ్రాఫిక్ ఆర్టిస్ట్‌గా చేరాడు. అలా కెరీర్ ప్రారంభించిన విశ్వనాథ్ ఒక్కోమెట్టు ఎదుగుతూ విప్రోలో చేరాడు. ఇక్కడ సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూనే ఖాళీ సమయం, వారాంతాలలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకోఆర్ట్‌గా ఎలా మార్చాలని పరిశోధిస్తుండేవాడు. రకరకాల ప్రయోగాల తరువాత.. గాడ్జెట్స్ వ్యర్థాలను ఉపయోగించి చిన్నచిన్న జంతువులు తయారు చేశాడు. అవి ముద్దుగా ఎంతో ఆకర్షణీయంగా ఉండడంతో తన ఇకో ఆర్ట్‌ను పెంచుకుంటూ పోయాడు. ఫ్యాషన్ జ్యూవెలరీ నుంచి అందమైన శిల్పాలు, రోబోలదాకా అన్ని ఎలక్ట్రానిక్ వ్యర్థాలతో తయారు చేస్తున్నాడు.

ఏరికోరి ఎంచుకుని...

ఎలక్ట్రానిక్ వ్యర్థాలు పర్యావరణానికి ప్రాణాంతకంగా మారాయని తెలుసుకుని ఇకో ఆర్ట్‌ను మరింత సీరియస్‌గా తీసుకున్నాడు విశ్వనాథ్. ఈ క్రమంలోనే ఈ వ్యర్థాలను కొనుక్కునేవాడు. అన్నింటిని గంపగుత్తగా కొనకుండా కంప్యూటర్ విడిభాగాలు, ల్యాప్‌టాప్స్, డేటా కార్డులు, డీవీడీ, వీసీఆర్, ఫ్లాపీ డ్రైవ్స్, సెట్–టాప్‌బాక్స్‌లు, ల్యాండ్‌లైన్, కార్డ్‌లెస్ ఫోన్‌లు, గ్లూకో మీటర్లను ఏరికోరి ఎంచుకుని తీసుకునేవాడు. వీటిలో కూడా రాగి, బంగారం, రంగు రంగుల వైర్లు, కీబోర్డులను ప్రత్యేకంగా సేకరించి రకరకాల బొమ్మల రూపకల్పనకు ఉపయోగిస్తున్నాడు. ఆరు అడుగుల అమ్మాయి రూపంతో విగ్రహం, ప్రముఖ వ్యాపారవేత్త అజీం ప్రేమ్‌జీ ఫోటో, ఇకో జ్యూవెలరీ, కీబోర్డు కామధేనువు వంటి బొమ్మలు ఐదు వందలకు పైగానే తయారు చేశాడు.









హాబీని కెరీర్‌గా...

విశ్వనాథ్ తయారు చేసిన బొమ్మలు ఆకర్షణీయంగా అందంగా ఆకట్టుకుంటుండడంతో విక్రయించడం మొదలు పెట్టాడు. రెండేళ్ల క్రితం రిటైర్ అయిన విశ్వనాథ్.. తొలినాళ్లల్లో హాబీగా ఉన్న ఇకోఆర్ట్‌ను పూర్తి సమయం కేటాయిస్తూ ఇకోఆర్ట్ వస్తువులు విక్రయిస్తూ సరికొత్త కెరీర్‌ను సృష్టించుకున్నాడు. ఇకోఆర్ట్ వస్తువులు కొనే కస్టమర్లు ఢిల్లీలోనేగాక, యూరప్, నెదర్లాండ్స్, అమెరికా వంటి దేశాల్లో ఇకో ఆర్ట్ కోసం కస్టమర్లు ఎగబడుతున్నారు. దేశంలోనేగాక విదేశాల్లో తన ఇకో ఆర్ట్‌ను ప్రదర్శిస్తూ మంచి ఆదరణ పొందుతున్నాడు.





వందల కేజీలపైనే...

కీబోర్డు కీల నుంచి గోడగడియారంలో భాగాల వరకు అన్నీ సేకరించి ఇకో ఆర్ట్ రూపొందిస్తోన్న విశ్వనాథ్ ఇప్పటిదాకా రెండువందల కేజీల ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ఇకో ఆర్ట్స్‌గా మార్చాడు. అయితే ఈ ఇకో ఆర్ట్ అంత సులభం కాదని విశ్వనాథ్ చెబుతున్నాడు. ''ఈ – వ్యర్థాల నుంచి ఆర్ట్ కావాల్సిన భాగాలను సేకరించి వాటికి ఆకారం, రంగు వేసి తుదిమెరుగులు దిద్దడానికి చాలా సమయం పడుతుంది. జ్యూవెలరీ తయారు చేయడానికి రెండు మూడు నిమిషాలు పడితే, శిల్పాలు తయారు చేయడానికి వారాలు, నెలలు పడుతుంది. అయినప్పటికీ ప్రస్తుతం రీసైక్లింగ్ చేసిన ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉంది. ఇటు కస్టమర్ల మనసు దోచుకోవడంతోపాటూ, పర్యావరణానికి హానీ కలగకుండా ఈ ఇకోఆర్ట్ ఎంతో సంతృప్తినిస్తుంది. ముందు ముందు మరిన్ని కళారూపాలు తీసుకురానున్నాను''అని విశ్వనాథ్ చెబుతున్నాడు.